క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వలంటీర్ మృతి



గుంటూరు రూరల్: స్వర్ణభారతీనగర్, మిషన్ ఫారంలోని 178 సచివాలయం పరిధిలో పని చేస్తున్న వలంటీర్ కె. శ్రీనివాస రావు (28) సోమవారం పొన్నూరు రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. భౌతికకాయానికి మంగళవారం ఎమ్మెల్యే మేకతోటి సుచరిత భర్త, ఇన్‌కంటాక్స్ మాజీ కమిషనర్ మేకతోటి దయాసాగర్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మృతుని కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కుటుంబ సభ్యుల్ని ఓదార్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

యువతకు ఉచిత కంప్యూటర్ శిక్షణ

నెహ్రూనగర్: ప్రధాన మంత్రి కౌశల్ కేంద్ర, సింక్రోసర్వ్ గ్లోబల్ సొల్యూషన్స్ సంయుక్త ఆధర్యంలో యువతకు ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇవ్వనున్నట్లు సింక్రోసర్వ్ సెంటర్ హెడ్ ఎన్. కిశోర్‌బాబు తెలిపారు. బ్రాడీపేటలోని సంస్థ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పదో తరగతి, ఐటీఐ, డిప్లొమా కనీస విద్యార్హతతో ఎంఎస్ ఆఫీస్, ట్యాలీ, కంప్యూటర్ హార్డ్‌వేర్, సోలార్ టెక్నీషియన్‌తో పాటు టైలరింగ్ ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొనారు. శిక్షణ అనంతరం ఉపాధి అకాశాలు కూడా కల్పించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు బ్రాడీపేట 4/15, సింక్రోసర్వ్ గ్లోబల్ సొల్యూషన్స్‌లో లేదా 9390713161, 9100064573 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. జూన్ 1 నుంచి కొత్త బ్యాచ్ ప్రారంభమవుతుందని తెలియజేశారు.

శిబిరంలో విద్యార్థులకు పలు అంశాలపై శిక్షణ

గుంటూరు ఎడ్యుకేషన్: ఏసీ కళాశాల వద్ద ఉన్న ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మంగళవారం విద్యార్థులకు వివిధ అంశాలపై శిక్షణ కల్పించారు. ఈ సందర్భంగా నర్సింగ్ విద్యార్థిని డి. పల్లవి క్రీడాంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం సమాజంలో మెలిగే అంశాలపై వివరించారు. గ్రంథాలయాధికారి ఎన్.వెంకటేశ్వర రావు పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ

గుంటూరు ఈస్ట్: భార్యాభర్తల మధ్య గొడవ నేపథ్యంలో ఇరువర్గాలు పరస్పర దాడులు చేసుకున్న ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. బెజవాడ సుకన్యకు, కొర్నేలుకు 12 సంవత్సరాల కిందట వివాహమైంది. ఇద్దరి మధ్య మనస్పర్ధలు ఏర్పడడంతో సుకన్య తుఫాన్‌నగర్‌లోని పుట్టింటికి వచ్చింది. భార్యాభర్తలు ఫోన్‌లో గొడవ పడ్డారు. ఈ నేపథ్యంలో మంగళవారం కొర్నేలు, అతని తల్లిదండ్రులు సుకన్య నివాసానికి వెళ్లారు. ఈ సమయంలో రెండు కుటుంబాలు పరస్పరం గొడవ పడి దాడి చేసుకున్నారు. పరస్పర ఫిర్యాదులపై పోలీసులు కేసు నమోదు చేశారు.

వైభవంగా వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు



పాత గుంటూరు: కొత్తపేటలోని శ్రీ జగన్నాథ స్వామి దేవస్థానంలో శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామిని శ్రీ వరాహ లక్ష్మీ నరసింహస్వామిగా అలంకారం చేసి ప్రత్యేక పూజలు చేశారు. లక్ష్మీ నరసింహ హోమం నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థానం కార్యనిర్వహణాధికారి డి. శ్రీనివాసరావు, చైర్మన్ జయప్రకాష్‌రెడ్డి, అర్చకులు అయోధ్య అయ్యప్ప, ధర్మకర్తల మండలి సభ్యులు విశాలాక్షి, వెంకట జ్యోతి, నరేష్ కుమార్, రామకోటేశ్వరరావు, వెంకటరత్నం, శ్రీనివాసులు, అనిత శివకుమారి పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల సాకారం

ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య



నవులూరు ఏరియాలో పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య, జేసీ రాజకుమారి

పెదకాకాని: పేదల సొంతింటి కల నెరవేర్చడం ప్రభుత్వ ఆశయమని ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య పేర్కొన్నారు. పెదకాకాని మండలంలోని పలువురికి మంగళవారం నవులూరు ప్రాంతంలోని ఆర్– 5 జోన్‌లో పెదకాకాని, నంబూరు, కొప్పురావూరు, వెనిగండ్ల, తక్కెళ్లపాడు, ఉప్పలపాడు, వెంకటకృష్ణాపురం గ్రామాలకు చెందిన వారికి జాయింట్ కలెక్టర్ రాజకుమారితో కలసి ఇళ్ల పట్టాల్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కిలారి మాట్లాడుతూ దేశ చరిత్రలో 31 లక్షల మందికి ఇళ్ల పట్టాల్ని పంపిణీ చేసిన ఘనత సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని తెలిపారు. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన అన్ని పథకాలు ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. పేదలు అద్దె ఇళ్లలో, కాలువ గట్ల పైనా, రోడ్ల పక్కన నివసిస్తుంటే గత టీడీపీ ప్రభుత్వం ఏనాడు పట్టించుకోలేదని విమర్శించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పార్టీలు, రాజకీయాలు, వర్గాలకు అతీతంగా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఇళ్ల పట్టాల్ని పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ప్రతి పేదవాడు సొంతిల్లు నిర్మించుకోవాలనేదే ప్రభుత్వ ఆశయమని పేర్కొన్నారు. పెదకాకాని మండలంలో 1,991 మందికి పట్టాల్ని అందజేస్తున్నట్లు తెలిపారు. జిల్లా జాయింట్ కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే స్థలం మంజూరు చేసిన ప్రతి ఒక్కరూ ఇళ్లు నిర్మించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో ప్రభాకరరెడ్డి, తహసీల్దార్ పి. రత్నం, ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్ల జ్యోతి, ఆయా గ్రామాల సర్పంచులు గోళ్ల స్వరూపరాణి, నంబూరు జ్యోతి, పిట్టు శివకృష్ణారెడ్డి, ఎంఎస్ఎంఈ డైరెక్టర్ భీమవరపు విజయలక్ష్మి, ఉప్పలపాడు పీఏసీఎస్ చైర్‌పర్సన్ శివాబత్తుని దయానంద్, చాగంటి మురళీమోహన్‌రెడ్డి, ఆలపాటి రాఘవ, తోట శ్రీనివాసరావు, బందెల ఉదయ్‌శంకర్ పాల్గొన్నారు.

ఈద్గా, పీర్ల చావిడి నిర్మాణానికి స్థలం మంజూరు



కమిటీ సభ్యులకు అనుమతి పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే సుచరిత

కాకుమాను: మండలంలోని కొండపాటూరు గ్రామ ముస్లింల కల నెరవేరనుంది. నమాజ్ చేసుకునేందుకు మసీదు, పీర్ల చావిడి లేకపోయిన విషయాన్ని శాసనసభ్యురాలు మేకతోటి సుచరిత, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు కమిటీ దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్ర వక్ఫ్ బోర్డు కమిటీ సభ్యుల విజ్ఞప్తి మేరకు మంగళవారం ఎమ్మెల్యే మేకతోటి సుచరిత, వక్ఫ్ బోర్డు జిల్లా అధ్యక్షుడు షేక్ జిలాని, డైరెక్టర్ పొన్నూరు షేక్ కరీముల్లా సమక్షంలో గ్రామ కమిటీ సభ్యులకు స్థల అనుమతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జిలాని మాట్లాడుతూ అడిగిన వెంటనే స్థలాన్ని కేటాయించడం అభినందనీయమని తెలిపారు. నియోజకవర్గంలోని ముస్లింలంతా సుచరితకు రుణపడి ఉంటామన్నారు. ఆమె అడుగుజాడల్లో నడుస్తూ పార్టీని మరింత బలోపేతం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వలంటీర్ల వ్యవస్థతో విప్లవాత్మక మార్పులు



ఉత్తమ వలంటీర్లను సన్మానిస్తున్న నేతలు

కాకుమాను: రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఇంటి ముంగిటకు ప్రభుత్వ పథకాల్ని సకాలంలో అందజేస్తూ అవినీతి లేని స్వచ్ఛ పాలనకు తార్కాణాలుగా వలంటీర్లు పని చేస్తున్నారని కాకుమాను జెడ్పీటీసీ సభ్యురాలు ముజావర్ షేక్ గుల్జార్ బేగం అన్నారు. మండలంలోని కాకుమాను, కొమ్మూరు, చినలింగాయపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద మంగళవారం వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న గుల్జార్ బేగం మాట్లాడతూ వలంటీర్ల వ్యవస్థతో ప్రభుత్వ పాలనలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని తెలిపారు. ప్రతి వలంటీర్ నిబద్ధతతో పని చేయడం వల్ల ప్రతి గ్రామంలో సత్ఫలితాలు వస్తున్నాయని చెప్పారు. ఎంపీపీ రామినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ కోవిడ్ సమయంలో వలంటీర్లు ప్రాణాల్ని సైతం పణంగా పెట్టి విధులు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. ప్రజల వద్దకే ప్రభుత్వ సంక్షేమ పథకాల్ని అందించాలనే ధృడ సంకల్పంతో ముఖ్యమంత్రి ఎంతో ముందుచూపుతో రాష్ట్ర వ్యాప్తంగా వలంటీర్ వ్యవస్థను ప్రవేశపెట్టారన్నారు. ఇంటి వద్దకే సంక్షేమ పథకాల్ని అందిస్తున్న ఘనత దేశ చరిత్రలో మన రాష్ట్రానికే దక్కుతుందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ వలంటీర్లుగా ఎంపికైన వారిని ఘనంగా సన్మానించి మెమెంటోలను అందజేశారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు పెదపూడి కపిల్, సర్పంచ్ శివకుమారి, ఎంపీటీసీ–2 కానుగుల పరమేశ్వరరావు, ఎంపీడీఓ దేవరకొండ శరత్‌బాబు, ఆ యా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కార్యదర్శులు, పార్టీ నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

సందడిగా నాలుగు వసంతాల సంబరాలు



కేక్ కట్ చేస్తున్న దయాసాగర్ తదితరులు



పొన్నూరులో కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

గుంటూరు రూరల్: రాష్ట్ర ముఖ్యమంత్రిగా వై.ఎస్. జగన్మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేసి నాలుగేళ్లయిన సందర్భంగా ఎమ్మెల్యే మేకతోటి సుచరిత కార్యాలయంలో కేక్ కట్ చేసి వేడుకల్ని నిర్వహించారు. ఇన్‌కంటాక్స్ మాజీ కమిషనర్ మేకతోటి దయాసాగర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే కనీవిని ఎరుగని రీతిలో నవరత్నాల్ని ప్రజల ఇంటికి చేర్చిన ఏకైక నాయకుడు జగనన్న మాత్రమేనని పేర్కొన్నారు. కుల మతాలకు, పార్టీలకు అతీతంగా అర్హత ఉంటే చాలు సంక్షేమ పథకం అందినట్టేనని ఆయన నిరూపించారని తెలిపారు. గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం స్థాపనకు సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి దానికి వలంటీర్ వ్యవస్థను అనుసంధానించి ప్రతి గడపకు సంక్షేమ పథకాల్ని అందించారని వివరించారు. పథకాల వల్ల రాష్ట్రం శ్రీలంకగా మారుతోందని గగ్గోలు పెట్టిన చంద్రబాబు, ప్రతిపక్షాలు నేడు ప్రజల్ని మోసం చేసేందుకు కుట్రలు పన్నుతున్నాయని చెప్పారు. చంద్రబాబు కుట్రల్ని ప్రజలు గమనించారని, రానున్న ఎన్నికల్లో ఆయనకు తగిన బుద్ధి చెబుతారని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు తుమ్మల సుబ్బారావు, భీమినేని వెంకటలక్ష్మి, ఎన్ఆర్ఈజీఎస్ సభ్యుడు మనోహర్‌రెడ్డి, ప్రత్తిపాడు వైస్ ప్రెసిడెంట్ బాపతు వెంకటేశ్వరరెడ్డి, జొన్నలగడ్డ సర్పంచ్ మబ్బు శిరీష, ఆర్ అండ్ బీ కార్పొరేషన్ డైరెక్టర్ పిల్లి మేరీ, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు మెట్టు వెంకటప్పారెడ్డి, జల్లేపల్లి వేణుబాబు, బాలకృష్ణ, ఉద్దగిరి మురళి, తంగెళ్ల నాగేశ్వరావు, పతకమూరి రామకోటేశ్వరరావు, ఎదురుపాక వెంకట్, దారం అశోక్‌యాదవ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పొన్నూరులో అట్టహాసంగా వేడుకలు

పొన్నూరు(చేబ్రోలు): ముఖ్యమంత్రిగా వై.ఎస్. జగన్మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టి నాలుగు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా పొన్నూరు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం పార్టీ నాయకులు భారీ కేక్ కట్ చేశారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల పాలనలో 98 శాతం పైగా హామీల్ని అమలు చేసినట్లు తెలిపారు. చెప్పినవి కాకుండానే.. చెప్పనవి కూడా అమలు చేసి చూపించిన ఘనత ఆయనకే దక్కుతుందని పేర్కొన్నారు. వలంటీర్, గ్రామ సచివాలయ వ్యవస్థ, రైతు భరోసా కేంద్రాల ద్వారా పరిపాలనలో నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ జిల్లా సలహా మండలి సభ్యుడు బొద్దులూరి రంగారావు, వైఎస్సార్ సీపీ నాయకులు రుద్రపాటి ఆదిశేషు, వట్టిప్రోలు రంగారావు, అమిరినేని సాంబశివరావు, కె. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పెదనందిపాడులో..

ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నాలుగు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా స్థానిక పార్టీ కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. ముందుగా మేకతోటి దయాసాగర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి వేడుకలు జరిపారు. అనంతరం కట్రపాడులో పోలేరమ్మ తల్లి, అంకమ్మ తల్లి తిరునాళ్ల సందర్భంగా దేవాలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అమ్మవారి ఆశీర్వాదం, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యకమంలో పార్టీ నేతలు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

పెదకాకాని: బాలిక అదృశ్యంపై కేసు నమోదైంది. మండలంలోని సగరపాలేనికి చెందిన ఎనిమిదో తరగతి చదువుతున్న బాలిక ఈనెల 24న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. కుమార్తె అదృశ్యంపై కలత చెందిన తండ్రి మనస్తాపంతో ఈనెల 29న పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. గుర్తించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. అదృశ్యమైన బాలిక ఆచూకీ కోసం మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వ్యసనాలకు బానిసలై దొంగతనాల బాట



నిందితులతో ఎస్ఐ డి.రవీంద్రబాబు, సిబ్బంది

ప్రత్తిపాడు: చెడు వ్యసనాలకు బానిసలుగా మారి దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు స్నేహితుల్ని పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక పోలీస్ స్టేషనులో మంగళవారం రాత్రి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్ఐ డి. రవీంద్ర బాబు కేసు వివరాల్ని వెల్లడించారు. ప్రత్తిపాడు మండలం నడింపాలెంలోని జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణం కోసం ఐదు సబ్ మెర్సిబుల్ మోటార్లను రూ. 90 వేలతో గ్రామ పంచాయతీ ఏర్పాటు చేసింది. ఈ నెల 11న గుర్తు తెలియని వ్యక్తులు మోటార్లను అపహరించారు. దీంతో పంచాయతీ కార్యదర్శి ఖాజా ఈ నెల 29న ప్రత్తిపాడు పోలీసులకు పిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన ఎస్ఐ రవీంద్రబాబు ఇరవై నాలుగు గంటల్లోనే ఛేదించారు. చినకోండ్రుపాడుకు చెందిన ముగ్గురు దొంగతనాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. వారి కదలికలపై నిఘా ఉంచారు. మంగళవారం యనమదల జాతీయ రహదారిపై గుంటూరు– చిలకలూరిపేట మార్గంలో అనుమానితులు ఉన్నారంటూ ఎస్ఐకు సమాచారం అందింది. సిబ్బందితో కలసి చినకోండ్రుపాడుకు చెందిన వల్లపు రాంబాబు, చావల బ్రహ్మయ్య, ఉప్పుతల వెంకట్రావును అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా మోటార్లు దొంగిలించినట్లు ఒప్పుకున్నారు. దీంతో వారి నుంచి మోటార్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్ని అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు ఎస్ఐ తెలిపారు. ముద్దాయిలందరిదీ ఒకే ఊరు కావడంతో వారంతా స్నేహితులని, రాంబాబు, వెంకటేశ్వరరావులు చిన్న చిన్న కూలి పనులు చేసుకుంటూ ఉంటారని, బ్రహ్మయ్య ఎలక్ట్రీషియన్ అని ఎస్ ఐ చెప్పారు.

వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు



హనుమంతవాహనంపై వామనావతారమూర్తిగా వేంకటేశ్వరస్వామి

పెదకాకాని: శ్రీ దశావతార వేంకటేశ్వరస్వామి దివ్య క్షేత్రంలో పంచమ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం ఉదయం స్వామి హనుమంత వాహనంపై వామనావతార మూర్తిగా, సాయంత్రం పరశురామావతారమూర్తిగా దర్శనమిచ్చారు. పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆరు రోజుల పంచమ వార్షిక బ్రహ్మోత్సవాల్లో చివరిరోజు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ప్రధాన అర్చకులు నరసింహాచార్యులు తెలిపారు. ఉదయం 9గంటలకు చక్రస్నానం, వసంతోత్సవం, శ్రీకృష్ణ, కల్కి అవతార వేంకటేశ్వర యజ్ఞం, గజ వాహనంపై శ్రీకృష్ణ అవతార స్వరూప ఉత్సవం, కల్కి అవతార స్వరూప ఉత్సవం, మహా పూర్ణాహుతి, సాయంత్రం 6 గంటలకు తెప్పోత్సవం, ద్వాదశ ప్రదక్షిణాలు, పవళింపు సేవ జరుగుతాయని నిర్వాహకులు తెలియజేశారు.

సందడిగా ఎంబీఏ హెచ్ఏ పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ప్రసంగిస్తున్న యూనివర్సిటీ దూరవిద్యా కేంద్రం డైరెక్టర్ నాగరాజు

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఎంబీఏ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ విభాగం పూర్వ విద్యార్థుల సమ్మేళనం మంగళవారం యూనివర్సిటీలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన యూనివర్సిటీ దూరవిద్యా కేంద్రం డైరెక్టర్, ఎంబీఏ హెచ్ఏ విభాగాధిపతి డాక్టర్ బి. నాగరాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంబీఏ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ విభాగం ప్రారంభం నుంచి ఇప్పటి వరకు ఈ కోర్సు చదివిన విద్యార్థులు అనేక ప్రభుత్వ, కార్పొరేట్ వైద్య రంగాల్లో ఉన్నత స్థాయిల్లో ఉపాధి అవకాశాలు పొందారని చెప్పారు. హాస్పిటల్ రంగంలో విరివిగా ఉపాధి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఈ విభాగాభివృద్ధికి వీసీ ఆచార్య పి. రాజశేఖర్ ప్రత్యేక ప్రోత్సాహం అందిస్తున్నారని పేర్కొన్నారు. పూర్వ విద్యార్థులు మాట్లడుతూ తాము అనేక రంగాల్లో అవకాశాలు పొందడానికి ఏంబీఏ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ కోర్సు కారణమని చెప్పారు.

పూర్వ విద్యార్థుల సంఘ కార్యవర్గం

పూర్వ విద్యార్థుల సంఘానికి గౌరవాధ్యక్షుడిగా విభాగాధిపతి డాక్టర్ బట్టు నాగరాజు, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా గుంటూరు గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ బి. ప్రవీణ్ కుమార్, ఉపాధ్యక్షుడిగా పి. ఆనంద్, జనరల్ సెక్రెటరీగా డాక్టర్ సీహెచ్. రాజీవ్ , కోశాధికారిగా ఏపీ హెల్త్ డిపార్ట్‌మెంట్ కన్సల్టెంట్ ఎ. వాసుబాబు, జాయింట్ సెక్రటరీగా కె. దిలీప్, లేడీ రెప్రజెంటేటివ్‌గా ఎం.ఎస్. అనూష ఎంపికయ్యారు. కార్యక్రమంలో విభాగ అధ్యాపకులు డాక్టర్ పి. శ్రీనివాస్, డాక్టర్ సాదిక్, డాక్టర్ శ్రీధర్, ఎం.ఆర్. డేవిడ్ రాజు, డాక్టర్ ప్రసాద్ పాల్గొన్నారు.

సివిల్స్ ర్యాంకర్ సుభాష్‌కు సత్కారం



సుభాష్‌ను సత్కరిస్తున్న భ్రమర అధినేత గల్లా రామచంద్రరావు, డైరెక్టర్లు

పాత గుంటూరు: సివిల్స్ సర్వీసెస్ పరీక్ష ఫలితాలలో 825 ర్యాంకు సాధించిన గుంటూరుకు చెందిన కొరిటిపాటి హృదయరాజు తనయుడు కె. సుభాష్‌ను మంగళవారం శ్రీ భ్రమర టౌన్‌షిప్స్ అధినేత గల్లా రామచంద్రరావు, సంస్థ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గల్లా రామచంద్రరావు మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలకు స్వేచ్ఛగా చదువుకునే వాతావరణం కల్పించి లక్ష్యం సాధించే ప్రయత్నంలో ధృఢ సంకల్పంతో ముందుకు సాగేలా ప్రోత్సహించాలని తెలిపారు. జనచైతన్య సంస్థ డైరెక్టర్ మాదల రత్నగిరిబాబు మాట్లాడుతూ సివిల్ సర్వెంట్ నిజాయతీ సమాజానికి మేలు చేస్తుందని తెలిపారు. మేకపాటి దయాసాగర్ మాట్లాడుతూ ఐఏఎస్ సాధించే వరకు మరింత పట్టుదలతో ముందుకుసాగాలని తెలిపారు. కార్యక్రమంలో భ్రమర డైరెక్టర్లు కోట శైలరెడ్డి, ఎల్.పి. రాజు, మురళీకృష్ణ, సీహెచ్. సతీష్‌బాబు, పి. నరేష్, బి. సాయిశంకర్, సుభాష్ కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు

గుంటూరు ఈస్ట్: మద్యం మత్తులో ఓ వ్యక్తి ఇంట్లోకి జొరబడి మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. వెంగళరావునగర్‌లో నివసించే ఓ కుటుంబం సోమవారం రాత్రి వేసవి కాలం కారణంగా ఇంటి తలుపులు దగ్గరకు వేసి నిద్రించింది. మద్యం మత్తులో తెల్లవారుజామున కొక్కిలిగడ్డ అంకమ్మరావు ఇంట్లోకి జొరబడి ఓ మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఆమె కేకలు వేసింది. దీంతో భర్త, స్థానికులతో కలిసి అంకమ్మరావుకు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

38 వాహనాలపై కేసులు



పట్నంబజారు: కాలుష్య ధ్రువీకరణ పత్రాలు లేకుండా వాహనాలు తిరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని డీటీసీ షేక్ కరీం స్పష్టం చేశారు. నగరంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం వాహనాలకు కాలుష్య తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీటీసీ షేక్ కరీం మాట్లాడుతూ మిషన్ లైఫ్‌లో భాగంగా కాలుష్య నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. పొల్యూషన్ సర్టిఫికెట్ లేకుండా నడుపుతున్న 38 వాహనాలపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. తనిఖీలు జిల్లా వ్యాప్తంగా జరుగుతాయని వివరించారు. కార్యక్రమంలో ఎంవీఐ గోపాల్, అధికారులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రయాణికుల సమస్యలకు పరిష్కారం

పాత గుంటూరు: ఆర్టీసీ గుంటూరు– 2 డిపో పరిధిలోని ప్రయాణికుల సమస్యల్ని పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామని మేనేజరు షేక్ అబ్దుల్ సలాం తెలిపారు. డిపో కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి ఫిర్యాదులు, సమస్యల్ని తెలుసుకున్నారు.

- గుంటూరు నుంచి హైదరాబాద్‌కు వెళ్లే బస్సులకు మంగళగిరి స్టేజి ఏర్పాటు చేయాలని ఆ పట్టణానికి చెందిన.సాంబశివరావు కోరారు.
- మణిపురం బ్రిడ్జి వద్ద విజయవాడ వెళ్లే బస్సులు ఆపడం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోందని, దాన్ని కంట్రోల్ చేయమని గుంటూరుకు చెందిన శంకర్ కోరారు.
- గుంటూరు నుంచి విశాఖపట్నం, హైదరాబాద్‌కు ఏసీ స్లీపర్ బస్సులు ఏర్పాటు చేయాలని పాత గుంటూరుకు చెందిన కిశోర్ కోరారు.
- గుంటూరు నుంచి ఉదయగిరికి వయా ఒంగోలు, కందుకూరు, వింజమూరు మీదుగా బస్సు సౌకర్యం కల్పించాలని గుంటూరుకు చెందిన వీరవల్లి బ్రహ్మయ్య కోరారు.